సాక్షి
వైఎస్‌ఆర్ జిల్లా

శుక్రవారం । 19 । ఏప్రిల్ । 2024



వైఎస్సార్ సీపీలో చేరికలు

ఖాజీపేట మండలం బి.కొత్తపల్లె పంచాయితీలో ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి సమక్షంలో 100 కుటుంబాలు గురువారం టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరాయి. -8లో



సివిల్స్ ఫలితాల్లో రాజుసం

కడప నగరం బాలాజీనగర్‌కు చెందిన హరి ప్రసాద్‌రాజు యూపీఎస్సీ ఫలితాల్లో ఆలిండియా 475వ ర్యాంకు సాధించి ఐఆర్‌ఎస్‌కు ఎంపికయ్యాడు. -8లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం 43.2/24.4

జిల్లాలో గురువారం 24.4 - 43.2 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 2.2 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్

మొదలైన నామినేషన్ల సందడి

పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికల్లో కీలక ఘట్టం మొదలైంది. ఎన్నికల బరిలో పోటీని ఖరారు చేసే నామినేషన్ల పర్వానికి అభ్యర్థులు తెరలేపారు. తొలిరోజున అంతంత మాత్రంగానే అభ్యర్థులు నామినేషన్లు సమర్పించారు. అన్నమయ్య, వైఎస్సార్ జిల్లాల వ్యాప్తంగా ఏర్పాటు చేసిన అన్ని రిటర్నింగ్ అధికారుల కార్యాలయాల వద్ద ప్రశాంత వాతావరణంలో నామినేషన్ల ప్రక్రియ జరిగేలా చర్యలు తీసుకున్నారు. ఆర్‌ఓ సెంటర్‌కు వంద మీటర్ల దూరంలో 144 సెక్షన్ విధించారు.

- తొలిరోజు రాజంపేట పార్లమెంటుకు 2. కడప పార్లమెంటుకు 2 నామినేషన్లు
- అసెంబ్లీకి అన్నమయ్య జిల్లాలో 9. వైఎస్సార్ జిల్లాలో 9 నామినేషన్లు దాఖలు



రాజంపేట ఆర్‌ఓ మోహనరావుకు నామినేషన్ పత్రాన్ని అందజేస్తున్న ఆకేపాటి, పాల్గొన్న సురేష్‌బాబు

కడప సెవెన్‌రోడ్స్/రాయచోటి: సాధారణ ఎన్నికలకు సంబంధించి మరో కీలక ప్రక్రియ గురువారం మొదలైంది. రాష్ట్రంలోని 175 అసెంబ్లీ, 25 లోక్‌సభ స్థానాలకు గత నెల16న ఎన్నికల షెడ్యూలు విడుదల కాగా గురువారం ఎన్నికల కమిషన్ అన్నింటికి నోటిఫికేషన్ జారీ చేసింది. నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైన మొదటి రోజునే రాజంపేట-24 పార్లమెంటు స్థానానికి 2 నామినేషన్లు దాఖలయ్యాయి. రాజంపేట పార్లమెంటుకు వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా పి.వి.మిథున్‌రెడ్డి తరపున ఆయన తల్లి స్వర్ణలత, సోదరి శ్రీశక్తిలు నామినేషన్‌ను పార్లమెంటు ఎన్నికల రిటర్నింగ్ అధికారి అభిషిక్త్ కిషోర్‌కు అందజేశారు. గురువారం మధ్యాహ్నం 1.16 గంటలకు మిథున్‌రెడ్డి తరపున ఒక సెట్టు నామినేషన్ పత్రాలను వారు దాఖలు చేశారు. వీరి వెంట వీరబల్లి మాజీ మండలాధ్యక్షుడు విజయభాస్కర్‌రెడ్డి, రాజంపేట నియోజకవర్గం యువనేత మదనమోహన్‌రెడ్డి ఉన్నారు.

- రాజంపేట పట్టణానికి చెందిన మాదా రాజా జాతీయ చేతి వృత్తుల ఐక్యవేదిక పార్టీ తరపున ఎంపీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. నామినేషన్ దాఖలు సమయంలో రాజా వెంట కుమార్తె చిన్నారి ఉండటం విశేషం. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అన్నమయ్య జిల్లాలో పార్లమెంటుకు 2, అసెంబ్లీకి 9 కలిపి మొత్తం 11 నామినేషన్లు దాఖలైనట్లు జిల్లా ఎన్నికల అధికారి అభిషిక్త్ కిషోర్ తెలిపారు.

కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు..

నామినేషన్ల కార్యక్రమం సందర్భంగా అన్నమయ్య జిల్లా కలెక్టరేట్ ఎదుట కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. కలెక్టర్ కార్యాలయంలో రాజంపేట-24 పార్లమెంటు అభ్యర్థుల నామినేషన్లు దాఖలు చేయనున్న దృష్ట్యా కార్యాలయానికి వంద అడుగుల దూరం వరకు బారికేడ్లతో పాటు చెక్‌పోస్టును ఏర్పాటు చేశారు. నామినేషన్లు దాఖలు చేయడానికి వెళ్లే వారికి మూడు వాహనాలకు మాత్రమే అనుమతి ఉండగా నామినేషన్ల దాఖలుకు మాత్రం ఐదుగురికి అనుమతి ఉంది. అన్నమయ్య జిల్లా అదనపు ఎస్పీ రాజ్‌కమల్ ఆధ్వర్యంలో రాయచోటి, లక్కిరెడ్డిపల్లె సీఐలు సుధాకర్‌రెడ్డి, జీవన్ గంగనాధ బాబులు సిబ్బందితో పర్యవేక్షించారు.

మళ్లీ జగనన్న పాలన కోసం జనం ఎదురుచూపులు

రాజంపేట: ఈ రాష్ట్రంలో మళ్లీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన కోసం జనం ఎదురుచూస్తున్నారని, అది తప్పకుండా నెరవేరుతుందని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథరెడ్డి, వైఎస్సార్‌సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ సురేష్‌బాబు, వైఎస్సార్‌సీపీ రాజంపేట పార్లమెంటరీ నేత, కాపునేత గంటా నరహరి అన్నారు. గురువారం రాజంపేట ఎమ్మెల్యే అభ్యర్థిగా వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి రిటర్నింగ్ అధికారి టి.మోహన్‌రావుకు రె రెండు సెట్లు నామినేషన్ పత్రాలు సమర్పించారు. అనంతరం సబ్‌కలెక్టర్ గేట్ క్యాంప్‌లో ఆకేపాటి విలేకరులతో మాట్లాడుతూ జగనన్న సంక్షేమమే తనను గెలిపిస్తుందన్నారు. ఎంపీ మేడా రఘునాథరెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు చేస్తున్న కుట్రలను ఓటు రూపంలో ప్రజలే తిప్పికొడతారన్నారు. వైఎస్సార్‌సీపీ పార్లమెంటరీ నేత, కాపునేత గంటా నరహరి మాట్లాడుతూ అన్ని నియోజకవర్గాలలో ముస్లిం మైనార్టీలు, ఎస్సీ, కాపు సామాజికవర్గాలు పూర్తిస్థాయిలో వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా ఉన్నారన్నారు. ఈ సమావేశంలో రాజంపేట మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసులరెడ్డి, ఆకేపాటి సోదరుడు ఆకేపాటి అనిల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ జిల్లాలో..

- వైఎస్సార్ జిల్లాలో తొలిరోజు కడప లోక్‌సభకు రెండు, జిల్లాలోని మొత్తం ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు తొమ్మిది నామినేషన్లు దాఖలయ్యాయి. తెలుగుదేశం పార్టీ కడప లోక్‌సభ అభ్యర్థిగా చదిపిరాళ్ల భూపేష్ సుబ్బరామిరెడ్డి ఒక సెట్ నామినేషన్, అఫిడవిట్లు రిటర్నింగ్ అధికారి విజయరామరాజుకు సమర్పించారు. అన్నా వైఎస్‌ఆర్ కాంగ్రెస్‌పార్టీ తరుపున షేక్ చాంద్‌బాషానామినేషన్, అఫిడవిట్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా టీడీపీ అభ్యర్థి భూపేష్ సుబ్బరామిరెడ్డి విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుతం ఒక సెట్ నామినేషన్ పత్రాలు మాత్రమే సమర్పించామన్నారు. ఈనెల 20వ తేదీన మరోమారు నామినేషన్ పత్రాలు సమర్పించనున్నట్లు తెలిపారు.
- మైదుకూరు వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా గురువారం ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి తమ నామినేషన్ వేశారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయం నుంచి ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్సీ రమేష్ యాదవ్, పలువురు నాయకులు, కార్యకర్తలతో ఆయన స్థానిక తహసీల్దార్ కార్యాలయంలోని రిటర్నింగ్ అధికారి చాంబర్‌కు చేరుకున్నారు. మధ్యా హ్నం 12 గంటల ప్రాంతంలో ఆయన ఒక సెట్ నామినేషన్ పత్రాలు రిటర్నింగ్ అధికారి ఎ.చంద్రమోహన్‌కు అందజేశారు. రఘురామిరెడ్డి అభ్యర్థిత్వాన్ని ఆయన సతీమణి శెట్టిపల్లె ప్రభావతమ్మ బలపరిచారు. ఎమ్మెల్యే వెంట ఆయన తనయుడు నియోజకవర్గ సమన్వకర్త శెట్టిపల్లె నాగిరెడ్డి, మున్సిపల్ చైర్మన్ మాచనూరు చంద్ర, వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్ మదీనా దస్తగిరి ఉన్నారు.
- జమ్మలమడుగు నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థి చదిపిరాళ్ల ఆదినారాయణరెడ్డి తరపున ఆయన భార్య అరుణ తొలిసెట్టు నామినేషన్‌లను దాఖలు చేశారు.

వైఎస్సార్ జిల్లాలో నామినేషన్ల దాఖలు వివరాలు

కడప పార్లమెంటు నియోజకవర్గం..

- చదిపిరాళ్ల భూపేష్ సుబ్బరామిరెడ్డి (తెలుగుదేశం)
- షేక్ చాంద్‌బాషా (అన్నా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ)

అసెంబ్లీ స్థానం	అభ్యర్థి
కడప	అవ్వారు మల్లికార్జున (జాతీయ చేతి వృత్తుల ఐక్యవేదిక పార్టీ)
	షేక్ మహబూబ్‌బాషా (అన్నా వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ)
	ఎం.వి.సుధీర్‌కుమార్- (స్వతంత్ర)
ప్రొద్దుటూరు	కడింటి పెద్దన్న (సమాజ్‌వాది పార్టీ)
జమ్మలమడుగు	అల్లె ప్రభావతి (స్వతంత్ర)
	చదిపిరాళ్ల ఆదినారాయణరెడ్డి (బీజేపీ)
మైదుకూరు	శెట్టిపల్లె రఘురామిరెడ్డి (వైఎస్సార్ సీపీ),
	షేక్ మహబూబ్‌బాషా (నవరంగ్ కాంగ్రెస్ పార్టీ)
	శ్రీయపురెడ్డి రాజారామిరెడ్డి (అన్నా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ)
బద్వేలు	నిల్
పులివెందుల	నిల్
కమలాపురం	నిల్



అన్నమయ్య జిల్లాలో నామినేషన్ల దాఖలు వివరాలు

రాజంపేట పార్లమెంటు నియోజకవర్గం..

- పి.వి.మిథున్‌రెడ్డి(వైఎస్సార్‌సీపీ)
- మాదా రాజా (జాతీయ చేతి వృత్తుల ఐక్యవేదిక పార్టీ)

అసెంబ్లీ స్థానం	అభ్యర్థి
రాయచోటి	నిల్
రాజంపేట	ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి(వైఎస్సార్‌సీపీ) 2 సెట్లు
మదనపల్లి	షాజహాన్‌బాషా (తెలుగుదేశం)
పీలేరు	నల్లారి కిషన్‌కుమార్‌రెడ్డి -2 సెట్లు (కిషోర్‌కుమార్‌రెడ్డి)- తెలుగుదేశం
	నల్లారి తనూజరెడ్డి(టీడీపీ)
	నల్లారి అమరనాథరెడ్డి (టీడీపీ)
తంబళ్లపల్లి	పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి(వైఎస్సార్‌సీపీ)
రైల్వేకోడూరు	కొరముట్ల శ్రీనివాసులు



రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి



రాజంపేట పార్లమెంట్ అభ్యర్థి మిథున్‌రెడ్డి తరపున నామినేషన్ పత్రాలను ఇస్తున్న పి.స్వర్ణలత తదితరులు



బి.కొత్తకోట: ఆర్‌ఓకు నామినేషన్ పత్రాలు సమర్పిస్తున్న పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి



కల్లాం గంగిరెడ్డితో కలిసి నామినేషన్ దాఖలు చేస్తున్న ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు

నిబంధనల ఉల్లంఘనలపై సమాచారం ఇవ్వాలి

కడప సెవెన్‌రోడ్స్: సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఓటర్లను మభ్యపెట్టే చర్యలతోపాటు ఎన్నికల కమిషన్ నిబంధనలను ఉల్లంఘించే అంశాలపై వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని ఎన్నికల వ్యయ పరిశీలకులు రమేష్ భారతి కే.ఎస్, సత్యేంద్ర సింగ్ మెహరా, రాజేష్ కుమార్ మీనా గురువారం ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించే చర్యలపై సమాచారం అందినా, నగదు, బంగారం, ఓటర్లను మభ్యపెట్టే వస్తువుల పంపిణీ జరిగినా, అక్రమంగా రవాణా జరిగినా, మరే ఇతర ఎన్నికల నిబంధనల ఉల్లంఘన జరిగినా వెంటనే కింద పేర్కొన్న సెల్ నెంబర్లకు కాల్ చేసి ఫిర్యాదు చేయవచ్చన్నారు.

సమాచారం ఇవ్వాల్సిన అధికారుల ఫోన్ నెంబర్లు

- కడప పార్లమెంటరీ నియోజకవర్గానికి రమేష్ భారతి కే.ఎస్ (సెల్ 8712644921)
- బద్వేల్, కడప, పులివెందుల, కమలాపురం నియోజకవర్గాలకు చెందిన సత్యేంద్ర సింగ్ మెహరా (సెల్ : 8712644922)
- జమ్మలమడుగు, ప్రొద్దుటూరు, మైదుకూరు నియోజకవర్గాలకు చెందిన రాజేష్ కుమార్ మీనా (సెల్ : 8712644923)

రామా..మము బ్రోవుమా..



వేణుగానాలంకారంలో భక్తులకు అభయమిస్తున్న స్వామివారు



ఆకట్టుకున్న కళాకారుల కోలాటం

- వేణుగానాలంకారంలో రఘువీరుని రాజసం
- ప్రణమిల్లిన భక్తజనం
- హంసవాహనంపై స్వామివారి విహారం

ఒంటిమిట్ట: ఏకశిలానగరిలోని శ్రీ కోదండ రామ స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా రెండో రోజు గురువారం స్వామివారు వేణుగానాలంకారంలో ఆలయ నాలుగు మాడ వీధుల్లో భక్తులకు అభయమిచ్చారు. ఉదయం 7 నుంచి 9 గంటల వరకు ఊరేగింపు నిర్వహించారు. కోలాట నృత్యాలు, మంగళవాయిద్యాల నడుమ స్వామివారి ఊరేగింపు కోలాహలంగా జరిగింది. భక్తులు అడుగడుగునా కర్పూరహారతులు సమర్పించి స్వామివారిని దర్శించుకున్నారు.రామయ్య బ్రహ్మోత్సవాల్లో రాత్రి 7 నుంచి 9:00 గంటలకు హంసవాహన సేవ కనులపండువగా సాగింది. రాయంచపై రాములోరు మాడ వీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. సీతారామలక్ష్మణ మూర్తులను పట్టు వస్త్రాలు, ఆభరణాలు, పుష్పమాలికలతో అలంకరించారు. ఆలయ డిప్యూటీ ఈఓ నటేష్ బాబు ఆధ్వర్యంలో వాహన సేవ జరిగింది. హారతి కర్పూరాలతో భక్తులు తమ కోర్కెలు తీర్చాలని రాములవారికి ప్రణమిల్లారు. వేలాది మంది తరలిరావడంతో రామయ్య క్షేత్రం ఉత్సవ శోభతో వెల్లి విరిసింది.

ఘనంగా స్నపనతిరుమంజనం

పాలు, పెరుగు, తేనె, చందనంతతో ఉదయం 11 నుంచి 12 గంటల వరకు ఆలయంలో కల్యాణవేదిక వద్ద ఉత్సవమూర్తులకు స్నపనతిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు ఊంజల్ సేవ వైభవంగా జరిగింది.

జనం తరలె..రథం కదిలె

కన్నులపండువగా పట్టాభిరాముడి రథోత్సవం

వాల్మీకిపురం: శ్రీ పట్టాభిరామస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఏడో రోజు గురువారం ఉదయం స్వామివారి రథోత్సవం వైభవంగా సాగింది. సీతారామలక్ష్మణ ఉత్సవమూర్తులు శోభాయమానంగా అలంకరించి రథాన్ని అధిష్టించి తిరుమాడ వీధుల్లో విహరించి భక్తులను అనుగ్రహించారు. ఆ ప్రాంతమంతా జైశ్రీరామ్ నినాదాలతో మార్మోగింది. డప్పు, వాయిద్యాలు, కోలాటాలు, సంకీర్తనల నడుమ భక్తులు రథాన్ని లాగారు.అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. వేకువజామున సుప్రభాతసేవతో స్వామిని మేల్కొలిపి మూలవర్లకు తోమాలసేవ, కొలువు, పంచాంగ శ్రవణం,అర్చన, మొదటి గంట, బలి, శాత్తుమొర కార్యక్రమాలు భక్తులకు కనువిందు చేశాయి. రథోత్సవం అనంతరం స్వామివారికి స్నపన తిరుమంజనం, కైంకర్యములు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, మాజీ జడ్పీటీసీ సభ్యులు చింతల శివానంద రెడ్డి, చింతల సాయిక్రిష్ణారెడ్డి, శ్రేయ రెడ్డి, టీటీడీ అధికారులు, సిబ్బంది, జిల్లా నలుమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల్లో నేడు

బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం 8నుంచి 9గంటల వరకు తిరుచ్చి ఉత్సవం, 10 నుంచి స్నపన తిరుమంజన, సాయంత్రం 6 నుంచి ఊంజల్ సేవ, రాత్రి 8 నుంచి 10 గంటల వరకు అశ్వవాహనంపై స్వామివారి పార్వేట ఉత్సవం.



రథంపై ఊరేగుతున్న ఉత్సవమూర్తులు

దళితబంధువు

- ఎస్సీలకు అగ్రపీఠం వేసిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం
- ఉద్దండులు పనిచేసిన స్థానాల్లో ఆశీనులైన ఎస్సీ నేతలు
- వైఎస్ జగన్ సర్కార్‌లోనే దళితులకు ఆత్మగౌరవం

సాక్షి ప్రతినిధి, కడప: ఒకప్పుడు దళితులంటే చిన్న చూపు చూసేవారు. చులకనగా మాట్లాడేవారు. మీకెందుకు రాజకీయాలని దెప్పి పొడిచేవారు. సినిమాల్లో చూపించినట్లుగా అచ్చం అలాగే పెత్తందార్లు ప్రవర్తించేవారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో తద్భిన్నమైన పరిస్థితులు తెరపైకి వచ్చాయి. ఉద్దండులు చేపట్టిన స్థానాల్లో సైతం దళిత నేతలను కూర్చోబెట్టారు. నామినేటెడ్ పదవుల్లో అగ్రపీఠం వేశారు. ఎస్సీలకు సమప్రాధాన్యత కల్పించిన చరిత్ర సీఎం వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమే దక్కనున్నట్లు పలువురు అభిప్రాయపడుతోన్నారు.

మార్కెట్ కమిటీ చైర్మన్లుగా..

పులివెందుల అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ 1968లో ప్రారంభమైంది. అప్పటి నుంచి మొన్నటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చేంత వరకూ ఉద్దండులు పాలించారు. తొలి చైర్మన్ దేవిరెడ్డి రామకృష్ణారెడ్డి (మాజీ ఎంపీ డీఎస్‌రెడ్డి సోదరుడు) నియమింపబడ్డారు. 15ఏళ్లు ఆయనే చైర్మన్‌గా కొనసాగారు. ఆ తర్వాత రాచమల్లు శివశంకర్‌రెడ్డి, తూగుట్ల మధుసూధనరెడ్డి, పేర్ల పార్థసారధిరెడ్డి, తూగుట్ల రాఘవరెడ్డి, హిమకుంట్ల ప్రభాకర్‌రెడ్డి ఇలా....కాంగ్రెస్, టీడీపీ ప్రభుత్వ హయాంలలో చైర్మన్‌గిరి చేపట్టారు. నామినేటెడ్ పదవి కావడంతో రెడ్డి సామాజిక వర్గానికే కట్టబెట్టేవారు. ఆ చరిత్రను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తిరగరాశారు. ప్రభుత్వ పగ్గాలు చేపట్టగానే మార్కెట్ కమిటీ చైర్మన్‌గా గోటూరు చిన్నప్ప ఎస్సీ సామాజికవర్గానికి చెందిన నాయకుడిని నియమించారు. ఆ పదవి అలంకారప్రాయం ఎంత మాత్రం కాదు. రూ.50కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టారు. రైతుల మధ్య కోట్లాది రూపాయల లావాదేవీలు నడుస్తున్న పదవిలో దళిత నేతని కూర్చోబెట్టారు.

డీసీఎంఎస్‌లో..

కడప డీసీఎంఎస్ 1962లో ప్రారంభమైంది. అప్పటి నుంచి దాదాపు 30మందికి పైగా పాలించారు. సింగిల్‌విండో అధ్యక్షుడు చైర్మన్‌ను ఎన్నుకోవాలి. హేమాహేమీలు తలపడే ఈ పదవి కోసం జిల్లా వ్యాప్తంగా పోటీ ఉండేది. రెడ్డి సామాజికవర్గానికి చెందిన వారినే ఈ పదవి వరించేది. ఆ స్థానంలో దండు గోపి అనే ఎస్సీ సామాజికవర్గానికి చెందిన నాయకున్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కూర్చోబెట్టారు. ఆయన పదవీ కాలం ముగియడంతో ఆ స్థానంలో గోపి సతీమణి చంద్రలీలను చైర్‌పర్సన్‌గా ఎంపిక చేయించారు. ఇలా ఆధిపత్యం ప్రదర్శించే ప్రాంతాల్లో కూడా అణగారిన వర్గాలకు పెద్దపీట వేసిన చరిత్ర వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి మాత్రమే దక్కుతోంది.

చంద్రబాబు దళితులంటే చిన్నచూపు



'దళితులుగా పుట్టాలని ఎవరనుకుంటారు' ముఖ్యమంత్రి హోదాలో నారా చంద్రబాబునాయుడు వ్యాఖ్యానించారు. ఆయన వ్యాఖ్యలే దళితల పట్ల ఆయన వైఖరిని స్పష్టం చేశాయి. అత్యంత దుర్మార్గుడుగా చరిత్రలో నిలిచిపోయారు. పాలకుడు అణగారిన వర్గాలకు అండగా నిలిస్తే సమాజంలో మెరుగైన జీవనం దక్కనుంది. అలాంటి స్పృహ చంద్రబాబు నాయుడుకు లేదు. ఆయన చరిత్ర నీచమైనది. అందుకు తగ్గట్లుగానే టీడీపీ మీడియా కూడా అలాగే వ్యవహరిస్తోంది. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి అండగా నిలుస్తున్న ఎస్సీలను దూరం చేసేందుకు వండివార్చుతోంది.

-గోటూరు చిన్నప్ప, పులివెందుల మార్కెట్ కమిటీ చైర్మన్

జగనన్న ప్రభుత్వంలో దళితులకు అందలం



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన ప్రభుత్వంలో దళితులను అందలమెక్కించారు. సామాన్యులకు అత్యున్నత పదవులు ఇచ్చి గౌరవింపబడేలా చేశారు. వైఎస్సార్‌సీపీకి బలమైన ఓటు బ్యాంకుగా ఉన్న దళితుల మనసుల్లో విషం నింపేందుకు కొన్ని పత్రికలు, చానెళ్ల ప్రయత్నిస్తున్నాయి. టీడీపీ ప్రభుత్వంలో దళిత తహసీల్దార్ వనజాక్షిని చింతమనేని ప్రభాకర్ జుట్టుపట్టి ఈడ్చితే చంద్రబాబు రాజీ కావాలని ఒత్తిడి చేశారే తప్ప, కేసు నమోదు చేసి అరెస్ట్ చేయలేదు. దళితులుగా పుట్టాలని ఎవరైనా కోరుకుంటారా అని తన మనసులోని వివక్షను బయటపెట్టుకున్నారు.

-పులి సునీల్ కుమార్, ఏపీ సోషల్ వెల్ఫేర్ బోర్డు చైర్మన్

దళితులను దూరం చేసే కుట్ర



రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీకి దళితులను దూరం చేయాలనే కుట్ర జరుగుతోంది. దీనికి కర్త, కర్మ, క్రియ ప్రతిపక్షనేత చంద్రబాబే. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని లక్ష్యంగా చేసుకొని పచ్చ పత్రికల్లో ఇష్టానుసారంగా కథనాలు రాయడం దుర్మార్గం. చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు దళితులపై ఎన్నోదాడులు, దౌర్జన్యాలు జరిగినా ఎలాంటి న్యాయం జరగలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పొరపాటున ఎక్కడైనా దళితులపై దాడి జరిగితే 24 గంటల్లో నిందితులను అరెస్ట్ చేసి జైలుకు పంపారు. దళితులంటే మొదటి నుంచి చంద్రబాబుకు చిన్నచూపే.

-సీహెచ్ వినోద్ కుమార్, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు

భూపేష్.. బహుపేదట!

- కరిజ్మా మోటారు బైక్ మినహా స్వంత వాహనం లేదు
- చేతిలో రూ.2లక్షలు మాత్రమే నగదు
- సతీమణి జ్యోతికి రూ.32లక్షల బంగారు ఆభరణాలు
- అమె పేరిట రూ.53.38లక్షలు బ్యాంకు డిపాజిట్లు
- టీడీపీ కడప ఎంపీ అభ్యర్థి కుటుంబం స్థిర, చరాస్తులన్నీ కలిపినా రూ.1.5కోట్లు లోపే

సాక్షి ప్రతినిధి, కడప: చేతి నిండా డబ్బులేదు. సతీమణి ఆస్తులను మినహాయిస్తే స్వంతంగా పెద్దగా ఏమీ లేవు. మోటార్ బైక్ మినహా పెద్ద వాహనం లేదు. అయినా కడప ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం ఎన్నికల్లో రూ.95లక్షలు ఖర్చు పెట్టుకోవచ్చు. ఆ స్థాయి ఆస్తి కూడా టీడీపీ కడప పార్లమెంటు అభ్యర్థి చదిపిరాళ్ల భూపేష్‌సుబ్బరామిరెడ్డికి లేదని వెల్లడించారు. ఎన్నికల కమిషన్‌కు సమర్పించిన అఫిడవిట్‌లో అదే విషయాన్ని స్పష్టంగా వివరించారు. తన చేతిలో రూ.2లక్షలు నగదు మాత్రమే ఉంది. సతీమణి జ్యోతి వద్ద రూ.50వేలు నగదు ఉండగా, అమె పేరిట మరో రూ.53.38లక్షలు బ్యాంకు డిపాజిట్లు ఉన్నాయి.



టీడీపీ కడప ఎంపీ అభ్యర్థి భూపేష్ సుబ్బరామిరెడ్డి

మరో రూ.32 లక్షల విలువ గల బంగారు ఆభరణాలు కలిగి ఉన్నారు. స్వంతంగా భూపేష్ పేరిట డిపాజిట్లు లేవు. రూ.9లక్షలు బ్యాంకు రుణాలున్నాయి. రూ.9.62 లక్షల ఎల్‌ఐసీ ప్రీమియం చెల్లించినట్లు చెప్పుకొచ్చారు. రూ.25వేలు విలువ గల కరిజ్మా మోటార్ బైక్ మినహా ఫోర్‌వీలర్ కూడా తన పేరిట లేదని తెలియజేశారు. కాగా, తన పేరుపై 9.54 ఎకరాలు భూమి, సతీమణీ పేరిట 14.58 ఎకరాల భూమి ఉన్నట్లు వెల్లడించారు. సతీమణి జ్యోతి పేరిట మొత్తంగా రూ.85.88లక్షల విలువగల ఆస్తులుండగా, రూ.22.58లక్షలు బ్యాంకు అప్పులున్నాయి. ముద్దనూరులో స్వంత ఇల్లుంది. నమ్మబుద్ధి కావడం లేదా...నిజమే మీకు అనుమానం కలగవచ్చు. ఎందుకంటే ఆయన తండ్రి నారాయణరెడ్డి ఎమ్మెల్సీగా, బాబాయ్ ఆదినారాయణరెడ్డి మంత్రిగా పనిచేశారు. మరో బాబాయ్ శివనాథరెడ్డి ఎమ్మెల్సీగా పనిచేశారు. ఓమారు భూపేష్ సైతం మైలవరం జడ్పీటీసీగా పనిచేశారు. మరి వీరి ఆస్తులింతేనట! మీ అనుమానాలను నివృత్తి చేసుకోవాలంటే ఎన్నికల కమిషన్‌కు ఆయన సమర్పించిన అఫిడవిట్‌ను పరిశీలించుకోవచ్చు.

క్లుప్తంగా

రూ.5 కోట్లు విలువ చేసే బంగారం, వెండి పట్టివేత



పట్టుబడిన బంగారం వివరాలను వెల్లడిస్తున్న సీఐ విక్రమసింహ

గోపవరం : గోపవరం మండలం పి.పి.కుంట చెక్‌పోస్టు వద్ద వాహన తనిఖీల్లో గురువారం రూ.5 కోట్లు విలువ చేసే బంగారు ఆభరణాలు, వెండిని పోలీసులు పట్టుకున్నారు. నెల్లూరు నుంచి కడపకు వెళుతున్న బొలెరో వాహనాన్ని పోలీసులు ఆపి తనిఖీ చేయగా బంగారం, వెండి నగలు ఉన్నట్లు గుర్తించారు. ఈ మేరకు బద్వేలు రూరల్ సీఐ విక్రమసింహ, రూరల్ ఎస్ఐ రవికుమార్‌లకు సమాచారం ఇచ్చారు. పట్టుబడిన బంగారంతో పాటు వాహనాన్ని పోలీసుస్టేషన్‌కు తరలించారు. బంగారం, వెండికి సంబంధించి సరైన రసీదులు లేకపోవడంతో ఆదాయపన్నుశాఖ అధికారులకు అప్పగించారు. వీటి విలువ దాదాపు రూ.5 కోట్లు ఉంటుందని సీఐ తెలిపారు. తనిఖీల్లో పట్టుబడిన బంగారం, వెండి ప్రైవేటు వ్యాపారులకు సంబంధించినవిగా గుర్తించినట్లు సీఐ తెలిపారు. వీఆర్‌ఓ వెంకటేశ్వర్లు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

రూ.19.26 లక్షలు సీజ్

కమలాపురం : కడప–తాడిపత్రి ప్రధాన రహదారిలో కమలాపురం–చెప్పలి క్రాస్ రోడ్డు సమీపంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా కారులో తరలిస్తున్న రూ.19,26,330 నగదును సీజ్ చేసినట్లు ఫ్లెయింగ్ స్క్వాడ్ టీం సభ్యులు తెలిపారు. బుధవారం అర్ధరాత్రి చెప్పలి క్రాస్ రోడ్డు వద్ద ఫ్లెయింగ్ స్క్వాడ్ టీం సభ్యులు వాహనాలు తనిఖీలు చేపట్టారు. ఇందులో భాగంగా కడప నగరానికి చెందిన గడ్డం మధుసూదన్‌రెడ్డి కారులో ఎర్రగుంట్ల వైపు నుంచి కడపకు వెళ్తుండగా తనిఖీలు చేపట్టారు. ఈ కారులో నగదు పట్టుబడింది. ఈ నగదు కొండాపురం మండలం ఏటూరు దగ్గర గల క్వారీకి సంబంధించిన డబ్బులని అతడు తెలిపాడు. అయితే అందుకు సంబంధించిన బిల్లులు లేకపోవడంతో సీజ్ చేసినట్లు ఫ్లెయింగ్ స్క్వాడ్ అధికారులు తెలిపారు.

వ్యక్తి అదృశ్యం



వెంకటశివ(ఫైల్)

గాలివీడు : మండలంలోని ఎగువగొట్టివీడు గ్రామానికి చెందిన వెంకటశివ అనే వ్యక్తికి మతిస్థిమితం లేకపోవడంతో సోమవారం మధ్యాహ్నం నుండి కనబడటం లేదని గురువారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. ఆచూకి తెలిసిన వారు 91211 00556 నెంబర్‌కు సమాచారం అందించాలని తెలిపారు. ఈ మేరకు పోలీసులు అదృశ్యం కేసు నమోదు చేశారు.

11న జాతీయ లోక్ అదాలత్

కడప అర్బన్ : జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మే 11న జిల్లా వ్యాప్తంగా జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహించనున్నామని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ జీ. శ్రీదేవి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ సెక్రటరీ, జడ్జి ఎస్. బాబా ఫక్రుద్దీన్‌లు గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు. మరింత సమాచారం కోసం ఫోన్ నెంబర్స్ 08562- 258622, 244622 లో సంప్రదించాలని వారు కోరారు.

వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీలో చేరికలు

ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

ఖాజీపేట : మీకు సేవచేశాను.. ప్రజాసమస్యలు పరిష్కరించాను.. ఎన్నికల్లో తిరిగి ఎమ్మెల్యేగా గెలిపించి ఆశీర్వదించాలని ఎమ్మెల్యే రఘురామిరెడ్డి ఓటర్లను కోరారు. బి.కొత్తపల్లె పంచాయితీలో ఎమ్మెల్యే రఘురామిరెడ్డి ఆధ్వర్యంలో సుమారు 100 కుటుంబాలు పార్టీలో చేరాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీనివాసపురానికి 40 సంవత్సరాలుగా సరైన రహదారి లేదన్నారు. ప్రజల కోరిక మేరకు రూ. 63లక్షలతో కొత్త రహదారి వేశామన్నారు. ఒక్క ఖాజీపేట మండలానికి పంటల బీమా సుమారు రూ.27 కోట్లు వచ్చిందన్నారు. రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్ సంక్షేమ పాలన అందజేస్తున్నారన్నారు. సంక్షేమ పాలన, అభివృద్ధి కోసం మళ్లీ వైఎస్‌ఆర్‌సీపీకి పట్టం కట్టాలని కోరారు.

టీడీపీ నుంచి పార్టీలో చేరిన వారు..

మాజీ డీలర్ ములపాక మునిరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, పెద్దమునిరెడ్డి, లక్ష్మణస్వామి రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, రెడ్యం వెంకటశివారెడ్డి, అంకిరెడ్డి, శ్రీనివాసుల రెడ్డి, తవ్వా రామమునిరెడ్డి, ములపాక చంద్రమోహన్ రెడ్డి, జంపన గంగిరెడ్డి, పత్తి శేఖర్‌తోపాటు మహిళలు పెద్ద ఎత్తున పార్టీలో చేరారు.

ఈకార్యక్రమంలో ఏపీఐఐసీ డైరెక్టర్ గంగాధర్ రెడ్డి, అగ్రహారం సొసైటీ అధ్యక్షుడు రాఘవరెడ్డి, కడప రీజనల్ ఆర్టీసీ మాజీ అధ్యక్షుడు రెడ్యం వెంకట సుబ్బారెడ్డి, కేసీ కెనాల్ ప్రాజెక్టు కమిటీ మాజీ ఉపాధ్యక్షుడు రెడ్యం చంద్రశేఖర్‌రెడ్డి, కేసీ కెనాల్ ప్రాజెక్టు కమిటీ మాజీ అధ్యక్షుడు డీఎల్ శ్రీనివాసులరెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి నాగిరెడ్డి, వైఎస్సార్ సీపీ వైద్య విభాగపు జిల్లా ఉపాధ్యక్షులు డా. ములపాక వెంకట పవన్‌కుమార్‌రెడ్డి, పుల్లూరు మాజీ ఉపాధ్యక్షుడు నాగేశ్వర్‌రెడ్డి, సర్పంచ్‌లు పెద్దిరెడ్డి, ముత్తులూరు పాడు నాయకుడు దవనం గంగాధర్‌తోపాటు మండలంలోని నాయకులు పాల్గొన్నారు.



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

పెద్దముడియంలో 20 కుటుంబాలు

పెద్దముడియం : మండలంలోని బలపనగూడూరు గ్రామానికి చెందిన పోరెడ్డి అచ్యుతరామిరెడ్డి, ధనిరెడ్డి శివశంకర్ రెడ్డితో పాటు 20 కుటుంబాల వారు ఎమ్మెల్యే డా.సుధీర్ రెడ్డి సమక్ష్యంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులమై పార్టీలో చేరామన్నారు. పి.శివారెడ్డి, పి.గిరిధర్ రెడ్డి, కె.ప్రదీప్ రెడ్డి, గరిష బాలక్రిష్ణారెడ్డి, సుధీర్ రెడ్డి, రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వల్లూరులో..

వల్లూరు : మండలంలోని కొప్పోలు, గొల్ల ఓబాయపల్లె గ్రామాలకు చెందిన 20 కుటుంబాలు గురువారం టీడీపీ నుండి వైఎస్‌ఆర్‌సీపీలో చేరాయి. కొప్పోలు గ్రామానికి చెందిన మోపూరి వెంకట సుబ్బారెడ్డితో బాటు 17 కుటుంబాలు టీడీపీ నుండి వైఎస్‌ఆర్‌సీపీలో చేరాయి. గొల్ల ఓబాయపల్లెకు చెందిన మునిరెడ్డితో బాటు 8 కుటుంబాలు టీడీపీ నుండి వైఎస్‌ఆర్‌సీపీలో చేరాయి. ఈ మేరకు వారికి ఎమ్మెల్యే రవీంద్రనాథరెడ్డి, ఏపీఎస్ ఆర్‌టీసీ రాష్ట్ర చైర్మన్ అబ్బిరెడ్డి మల్లికార్జునరెడ్డి వైఎస్‌ఆర్‌సీపీ కండువాలను కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. మండల కన్వీనర్ అబ్బిరెడ్డి వీరారెడ్డి, పార్టీ నేత వేణు గోపాల్ రెడ్డి, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే డా.సుధీర్ రెడ్డి



కొప్పోలులో కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథరెడ్డి, ఏపీఎస్ఆర్‌టీసీ ఛైర్మన్ మల్లికార్జునరెడ్డి

శ్రీరామనవమి వేడుకల్లో అపశృతి

ఒకరు మృతి, 12 మందికి గాయాలు

వేంపల్లె : మండలంలోని రామిరెడ్డిపల్లె గ్రామంలో శ్రీరామనవమి వేడుకల్లో అపశృతి చోటుచేసుకుంది. గురువారం తెల్లవారుజామున స్వామివారి ఊరేగింపు సమయంలో విద్యుత్ తీగలు తగిలి పుల్లయ్యగారి చంద్ర ఓబుల్‌రెడ్డి మృతి చెందగా.. మరో 12 మందికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల మేరకు ఇలా ఉన్నాయి. రామిరెడ్డిపల్లె గ్రామంలో ప్రతీ ఏడాది శ్రీరామనవమి వేడుకలు ఘనంగా నిర్వహిస్తారు. అలాగే ఈ ఏడాది కూడా వేడుకల్లో భాగంగా స్వామివారిని గ్రామ పురవీధుల గుండా ఊరేగింపునకు తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో గ్రామంలో విద్యుత్ తీగలు కిందికి వేలాడడంతో ఇనుముతో తయారుచేసిన హనుమంతుని విగ్రహం చాలా ఎత్తు ఉండడంతో పైన ఉన్న విద్యుత్ తీగలు తగిలాయి. దీంతో విగ్రహం ఆనుకుని ఉన్న 13 మందికి విద్యుత్‌షాక్ తగిలింది. హుటాహుటిన విద్యుత్‌షాక్ తగిలిన అందరిని పులివెందులలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ పుల్లయ్యగారి చంద్ర ఓబుల్‌రెడ్డి మృతిచెందారు. మిగిలిన 12 మంది సరస్వతి, శ్రీరాములు, గంగాప్రసాద్‌రెడ్డి, నవీన్‌కుమార్‌రెడ్డి, జానకమునిరెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డి, లోకేష్ కుమార్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, సుమంత్‌కుమార్ రెడ్డి, శివప్రతాప్‌రెడ్డి, ప్రజ్వల్‌రెడ్డి, నాగేంద్రరెడ్డిలు చికిత్స పొందుతున్నారు. వారికి ఎటువంటి ప్రమాదం లేదని వైద్యులు ధృవీకరించారు. విషయం తెలుసుకున్న కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు ఇసి దినేష్‌రెడ్డిలు మార్చురీలో ఉన్న చంద్ర ఓబుల్‌రెడ్డి మృతదేహం వద్ద శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులు, గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న 12మందిని కలిసి పరామర్శించారు. వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందని భరోసానిచ్చారు. ఈ విషయంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో వేంపల్లె జడ్పీటీసీ సభ్యులు రవికుమార్‌రెడ్డి, మండల కన్వీనర్ చంద్ర ఓబుల్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ శ్రీనివాసులు, ఎంపీపీ లక్ష్మిగాయత్రి పాల్గొన్నారు.



చంద్ర ఓబుల్‌రెడ్డి మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, తదితరులు

నామినేషన్ల సందర్భంగా పటిష్ట బందోబస్తు

కడప అర్బన్ : జిల్లాలో సార్వత్రిక ఎన్నికలకు సంబంధించిన నామినేషన్ల ప్రక్రియ జిల్లా కలెక్టరేట్, కడప ఆర్డీఓ కార్యాలయాలలో గురువారం నుంచి ప్రారంభమైంది. జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ ఆదేశాల మేరకు కడప కలెక్టరేట్‌లో కడప పార్లమెంట్ అభ్యర్థుల నామినేషన్ల పర్వం ప్రారంభమైంది. ఈ ప్రక్రియలలో భాగంగా జిల్లా అదనపు ఎస్పీ (పరిపాలన) లోసారి సుధాకర్ పర్యవేక్షణలో చిన్నచౌక్ సీఐ నరసింహారెడ్డి, తాలూకా సీఐ తిమ్మయ్య, ఎస్ఐలు, కేంద్ర సాయుధ బలగాలతో పోలీసు సిబ్బంది గట్టి బందోబస్తు విధులను నిర్వహించారు. అలాగే కడప ఆర్డీఓ కార్యాలయం వద్ద అసెంబ్లీ నియోజక వర్గ నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. కడప డీఎస్పీ ఎం.డి షరీఫ్ పర్యవేక్షణలో కడప ఒన్‌టౌన్ సీఐ సి. భాస్కర్‌రెడ్డి, టూటౌన్ సీఐ ఇబ్రహీం, కడప ఒన్‌టౌన్ ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి, కేంద్ర సాయుధ బలగాలతో పకడ్బందీగా విధులను నిర్వహించారు. ఆయా కేంద్రాలకు 100 మీటర్ల దూరం వరకు 144 సెక్షన్‌ను విధించారు. నామినేషన్‌లను వేసే వారి వెంట అభ్యర్థితో పాటు ఐదుగురికి అనుమతి వుంటుందని సూచించారు. ఈప్రక్రియ ముగిసేంతవరకు ప్రజలు, వాహనదారులు సహకరించాలనీ పోలీసులు విజ్ఞప్తి చేశారు.



కడప ఆర్డీఓ కార్యాలయం వద్ద పోలీసుల బందోబస్తు

కొడుకుతో కలిసి భర్తను చంపిన భార్య!

ఇద్దరిపై హత్య కేసు నమోదు



వెంకటరమణ (ఫైల్)

బి.కొత్తకోట : భర్తతో జరిగిన గొడవ సందర్భంగా కొడుకుతో కలిసి భర్తను హతమార్చిన భార్య ఉదంతంపై అందిన ఫిర్యాదు మేరకు హత్య కేసు నమోదు చేశామని సీఐ సూర్యనారాయణ గురువారం తెలిపారు. ఆయన కథనం మేరకు వివరాలు. బి.కొత్తకోట మండలం కోటావూరు పంచాయతీ చవటకుంటపల్లెకు చెందిన ఇడగొట్టు వెంకటరమణ (55) రెడ్డెమ్మ (40) భార్యభర్తలు. వెంకటరమణకు రెడ్డెమ్మ రెండో భార్య. కొంతకాలంగా రెడ్డెమ్మ ప్రవర్తనలో మార్పు కనిపించడంతో ఇద్దరి మధ్య మనస్పర్ధలు నెలకొన్నాయి. ఇందులో భాగంగా బుధవారం మధ్యాహ్నం భార్యభర్తల మధ్య గొడవ చోటుచేసుకుంది. ఈ గొడవ తర్వాత వెంకటరమణ మృతి చెందాడు. మృతుడి మెడపైన గాయాలు, చెంపలపై స్వల్ప గాయాలు ఉన్నట్టు గుర్తించారు. దీంతో వెంకటరమణది సహజ మరణం కాదని అనుమానించిన మృతుని తమ్ముడు మారెప్ప పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రెడ్డెమ్మ, కుమారుడు గంగాధర్ (16) ఇద్దరూ కలసి వెంకటరమణను హతమార్చారని ఫిర్యాదులో పేర్కొన్నాడు. దీనికి రెడ్డెమ్మ వివాహేతర బంధమే కారణమన్న అనుమానం వ్యక్తం చేశాడు. ఈ ఫిర్యాదు మేరకు తల్లి, కుమారుడిపై హత్య కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించామని సీఐ తెలిపారు.

నందిపల్లెలో అవినాష్‌రెడ్డిపై పాట చిత్రీకరణ

వేంపల్లె : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కడప పార్లమెంట్ అభ్యర్థిగా పోటీచేస్తున్న వైఎస్ అవినాష్‌రెడ్డిపై వేంపల్లె మండలం నందిపల్లి గ్రామంలో పాట చిత్రీకరణ సాగింది. వైఎస్ అవినాష్‌రెడ్డి హయాంలో జిల్లాలో జరిగిన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలతో తెలుగు రాష్ట్రాల్లోని ప్రఖ్యాత సింగర్ నల్గొండ గద్దర్ పాడిన పాటకు కడప, బెంగుళూరుకు చెందిన నృత్యకారులతో పాటను చిత్రీకరించారు. నందిపల్లెకు చెందిన మారం శ్రీకాంత్‌రెడ్డి నిర్మాతగా సిరి మీడియా బ్యానర్‌పై ఈ పాట చిత్రీకరణ సాగుతోంది. పాట చిత్రీకరణను వైఎస్‌ఆర్‌సీపీ నాయకులు ఎస్‌వి సతీష్‌కుమార్‌రెడ్డి, జడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి, మండల కన్వీనర్ కల్లూరు చంద్ర ఓబుల్‌రెడ్డిలు జెండా ఊపి ప్రారంభించారు. నందిపల్లె గ్రామంలో పాట చిత్రీకరణ జరుగుతుండడంతో గ్రామస్తులు పాట చూడడానికి ఉత్సాహం చూపారు. డ్యాన్స్ మాస్టర్లు ఇస్మాయిల్, అఖిల్‌ల సారధ్యంలో సాగుతోంది. ఈ కార్యక్రమంలో మైనింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ సల్మా, ఎంపీటీసీ భారతి, కుప్పాలపల్లె సోమేశ్వర్‌రెడ్డి, రామశేఖర్‌రెడ్డితో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పాట చిత్రీకరణను ప్రారంభిస్తున్న ఎస్‌వి సతీష్‌రెడ్డి, రవికుమార్‌రెడ్డి, చంద్ర ఓబుల్‌రెడ్డి

కొండ గొర్రెను అడవిలోకి వదిలిన అధికారులు

సిద్దవటం : మండలంలోని జంగాలపల్లె గ్రామ సమీపంలోని పొలాల వద్దకు గురువారం మధ్యాహ్నం కొండ గొర్రె వచ్చి సమీపంలో ఉన్న బావిలో పడిపోయింది. గ్రామస్తులు అటవీ శాఖ రేంజర్ కళావతికి సమాచారం అందించారు. వెంటనే ఆమె సిబ్బందితో వచ్చి గ్రామస్తుల సహకారంతో బావిలో నుంచి ఆ కొండ గొర్రెను బయటికి తీశారు. రేంజర్ కళావతి మాట్లాడుతూ వేసవి కాలం కావడంతో 4 సంవత్సరాల వయస్సు కలిగిన ఆడ కొండగొర్రె జంగాలపల్లె గ్రామ సమీపం లోని పొలాల వద్దకు తాగునీరు కోసం వచ్చి ప్రమాదవశాత్తు బావిలో పడిందన్నారు. దానిని బయటికి తీసి సిద్దవటం బీటులోని సాబ్‌బావి అటవీ ప్రాంతంలోని సాసర్‌పీట్‌లో తాగునీరు తాపి అడవిలోకి వదిలామన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రేంజర్ ఓబులేస్, ప్రొటక్షన్ వాచర్‌లు, బేస్ క్యాంప్ సిబ్బంది పాల్గొన్నారు.



కాపాడిన కొండ గొర్రెను అడవిలోకి వదిలిన అటవీ అధికారులు

సైకాలజీలో డాక్టరేట్



దాసరి సుధాలావణ్య

వైవీయూ : యోగి వేమన విశ్వవిద్యాలయం మనోవిజ్ఞాన శాస్త్ర శాఖ పరిశోధక విద్యార్థిని దాసరి సుధాలావణ్యకు విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రకటించింది. వైవీయూ సైకాలజీ సహ ఆచార్యులు డాక్టర్ వేపరాల లాజరస్ పర్యవేక్షణలో 'ఇంపాక్ట్ ఆఫ్ స్ట్రెస్ అండ్ క్వాలిటీ ఆఫ్ లైఫ్ ఆన్ మెరిటియల్ అడ్జెస్ట్‌మెంట్ అండ్ మెంటల్ హెల్త్ అమాంగ్ ఉమన్ విత్ ఇన్‌ఫెర్టిలిటీ' అంశంపై ఆమె పరిశోధన పూర్తి చేసి విశ్వవిద్యాలయానికి సిద్ధాంత గ్రంథాన్ని సమర్పించింది. దీంతో ఈమె పరిశోధనకు విశ్వవిద్యాలయ అధికారులు డాక్టరేట్ ప్రకటించారు. ఈ సందర్భంగా పలువురు ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.

ప్రతి విద్యార్థి ఒక శాస్త్రవేత్త



నృత్యం చేస్తున్న విద్యార్థులు

కడప అగ్రికల్చర్ : ప్రతి విద్యార్థి ఉన్నత చదువులు చదివి శాస్త్రవేత్తగా రాణించాలని వ్యవసాయ పాలిటెక్నిక్ ప్రిన్సిపల్ శ్రీనివాసాచారి సూచించారు. కడప నగర శివారులోని ఊటకూరు వ్యవసాయ పరిశోధన కేంద్రంలో వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉన్నత చదువులు అభ్యసించి రైతులతోపాటు వ్యవసాయ రంగ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. అనంతరం విద్యార్థులు చేసిన నృత్యాలు అందరిని అలరించాయి. ఈ కార్యక్రమంలో డాక్టర్ వీరయ్య, అంకయ్యకుమార్, సునీల్ కుమార్, శ్రీవల్లి, భాగవతి ప్రియ, కృష్ణప్రియ, శిల్పకళ, మహేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులను బాధపెట్టవద్దు



సుల్తానా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వైవీయూ వీసీ, రిజిస్ట్రార్, ప్రిన్సిపాల్

వైవీయూ : అర్ధాంతరంగా తనువు చాలించి.. తల్లిదండ్రులను బాధపెట్టవద్దని యోగివేమన విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్ విద్యార్థులకు ఉద్బోధించారు. విశ్వవిద్యాలయ పరిపాలన భవన ప్రాంగణంలో ఇటీవల మృతి చెందిన వైవీయూ విద్యార్థిని ఎస్.షమ్మా సుల్తానా సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీతోపాటు రిజిస్ట్రార్ ఆచార్య వై.పి.వెంకటసుబ్బయ్య, ప్రిన్సిపల్ ఆచార్య ఎస్.రఘునాథ రెడ్డి, విద్యార్థులు, షమ్మా సుల్తానా చిత్రపటంవద్ద పుష్పాలు ఉంచి శ్రద్ధాంజలి ఘటించారు. వీసీ మాట్లాడుతూ బిడ్డల బంగారు భవిష్యత్తు కోసం తల్లిదండ్రులు తపిస్తారని, అలాంటి వారిని జీవితాంతం శోకానికి గురిచేయడం పెద్దతప్పిదమన్నారు. సమస్య ఉన్నా అధ్యాపకులు, అధికారులకు తెలియజేస్తే పరిష్కారం సూచిస్తారన్నారు. సంతాప సూచకంగా తరగతులను గురువారం రద్దు చేశారు. విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

సమాజ సేవా సమితి జిల్లా అధ్యక్షుడి నియామకం



మస్తాన్

కడప ఎడ్యుకేషన్ : సమాజ సేవాసమితి కడప జిల్లా అధ్యక్షుడిగా కడప నగరానికి చెందిన మస్తాన్‌ను ఎంపిక చేసినట్లు సమాజ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు వాండ్రాసి పెంచలయ్య తెలిపారు. గురువారం కడపలో జరిగిన సమావేశంలో మస్తాన్‌కు నియామక పత్రాన్ని అందచేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మస్తాన్ మాట్లాడుతూ నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

• నేను సైతం



జగనన్నపై అభిమానంతో వైఎస్‌ఆర్‌సీపీ నేతలు, కార్యకర్తలే కాకుండా ఆయన అభిమానులు సైతం ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నారు. మాకు అన్ని విధాలుగా అండగా వున్న జగనన్నకు నేను సైతం తోడుగా వుంటానంటూ వల్లూరు మండలంలోని కొప్పోలు ఎస్సీ కాలనీకి చెందిన దివ్యాంగుడైన రంగంగాల్ల ఉత్తయ్య ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. తన మూడు చక్రాల వాహనానికి వైఎస్‌ఆర్‌సీపీ జెండాను కట్టుకుని ప్రచారంలో పాల్గొని నేను సిద్ధమంటూ నిలిచారు. – వల్లూరు

• నేనూ..'ఇస్త్రీ' చేస్తా



వైఎస్సార్‌సీపీ కడప శాసన సభ నియోజకవర్గ అభ్యర్థి ఎస్‌బి అంజద్ బాషా గురువారం స్థానిక 12వ డివిజన్‌లో ప్రచారం చేపట్టారు. అందులో భాగంగా ఆయన ఇలా.. ఐరన్ చేసి పార్టీ శ్రేణులను, ప్రజలను ఉత్సాహపరిచారు. – కడప కార్పొరేషన్

సివిల్స్ ఫలితాల్లో రాజుసం

• కడప యువకుడికి 475వ ర్యాంకు
• అభినందించిన కుటుంబసభ్యులు

రూ.50 లక్షల వేతనం వదులుకుని సివిల్ సర్వీసెస్ సాధించడమే లక్ష్యంగా శ్రమించి సివిల్స్ విజేతగా నిలిచాడు. కడప నగరం బాలాజీనగర్‌కు చెందిన హరిప్రసాద్‌రాజు యూపీఎస్సీ ఫలితాల్లో ఆలిండియా 475వ ర్యాంకు సాధించి ఐఆర్ఎస్‌కు ఎంపికయ్యాడు. రానున్న రోజుల్లో ఐఏఎస్ సాధించడమే తన లక్ష్యమంటూ ముందుకు సాగుతున్నాడు.

వైవీయూ : కడప నగరం బాలాజీనగర్‌కు చెందిన జె. వెంకటసుబ్బమ్మ (హిందీపండిట్, పాతకడప జెడ్పీహెచ్‌ఎస్, కడప), కె. నాగేంద్ర వర్మ (మ్యాథ్స్ ఉపాధ్యాయుడు, గంగనపల్లె జెడ్పీహెచ్‌ఎస్)ల కుమారుడైన కడుమూరి హరిప్రసాద్‌రాజు యూపీఎస్సీ ఆలిండియా 475వ ర్యాంకు సాధించాడు. ప్రాథమిక విద్యాభ్యాసం కడప నగరంలోని నాగార్జున హైస్కూల్‌లో, తర్వాత రవీంద్రభారతి హైస్కూల్, అనంతరం మెరిట్ స్కాలర్‌షిప్ ద్వారా భాష్యం విద్యాసంస్థల్లో ఇంటర్మీడియట్ పూర్తిచేశాడు. అనంతరం ఏపీ ఎంసెట్‌లో 63వ ర్యాంకు సాధించడంతో పాటు ఐఐటీ ఖరగ్‌పూర్‌లో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ పూర్తి చేశాడు. అనంతరం మైక్రోసాఫ్ట్ కంపెనీలో రూ.50 లక్షల వార్షిక వేతనంతో ఉద్యోగంలో చేరాడు. అయినప్పటికీ సివిల్స్ సాధించాలన్న లక్ష్యం ఆయన్ను పోటీపరీక్షల వైపు వెళ్లేలా చేసింది. దీంతో యూపీఎస్సీలో తొలి ప్రయత్నంలో కొద్దిపాటిలో ర్యాంకు మిస్సయింది. అదే సమయంలో స్టాఫ్ సెలక్షన్ కమిషన్ ద్వారా కస్టమ్స్ ఆఫీసర్ ఉద్యోగానికి ఎంపికయ్యాడు. తాజాగా విడుదల చేసిన ఏపీపీఎస్సీ గ్రూప్–1 ఫలితాల్లో సైతం ర్యాంకు సాధించాడు. తాజాగా యూపీఎస్సీ ఫలితాల్లో రెండో ప్రయత్నంలో 475వ ర్యాంకుతో ఆలిండియా విజేతగా నిలిచాడు. కాగా ఈ ర్యాంకుతో ఐఆర్ఎస్ వచ్చే అవకాశం ఉందని, ఐఏఎస్ సాధించడమే తన లక్ష్యమని హరిప్రసాద్‌రాజు పేర్కొన్నాడు.



హరిప్రసాద్‌రాజును సన్మానిస్తున్న కుటుంబసభ్యులు

తాతయ్య, మేనమామల మార్గదర్శనంతో..

హరిప్రసాద్‌రాజు 4వ తరగతి చదువుతున్న సమయంలో తండ్రి కాలం చేయడంతో తాత జె. వెంకట్రామరాజు (విశ్రాంత ఉపాధ్యాయుడు), అమ్మమ్మ కృష్ణవేణి, మేనమామలు జె. వెంకటేశ్వరరాజు (హిందీపండిట్), జె. సుబ్బరాజు (ఇంజినీర్)ల ప్రోత్సాహంతో చిన్నప్పటి నుంచి చదువు పట్ల శ్రద్ధ వహిస్తూ అన్నింటా టాపర్‌గా నిలుస్తూ వచ్చాడు. ఈయన టాలెంట్ చూసి భాష్యం విద్యాసంస్థలు ఈయనకు స్కాలర్‌షిప్‌పై విద్యను అందించడం విశేషం. కాగా వీరి స్వస్థలం నందలూరు మండలం ములక్కాయలపల్లె కాగా 20 సంవత్సరాల నుంచి కడపలో నివాసం ఉంటున్నారు. ర్యాంకు సాధించిన హరిప్రసాద్ రాజును గురువారం కడప నగరంలోని వారి నివాసంలో కుటుంబసభ్యులు సత్కరించారు.